క్లుప్తంగా

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ, అభిషేకాలు తదితరాలను శనివారం నిర్వహించారు. పూజలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆనంద్‌కుమార్, శారద దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరు(దర్గామిట్ట): అనంతసాగరం మండలంలోని పలువురు నేతలు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. నగరంలోని మేకపాటి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో చిలకలమర్రికి చెందిన టీడీపీ నేతలు.. బీజేపీ నుంచి దొమ్మరాజు నరేంద్రరాజు ఆధ్వర్యంలో 25 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదే విధంగా జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మాబూ మస్తాన్, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పాశం మధు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో అన్ని వర్గాలకు భరోసా

నెల్లూరు(బారకాసు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు చేకూరిందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని జేసీఎస్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి కోరారు. పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 21వ డివిజన్లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని శనివారం ఆయన నిర్వహించారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పెంచలనర్సారెడ్డి, వెంకటరత్నం, వెంగళ్‌రెడ్డి, రాజా రెడ్డి, శేఖర్, సాయి, బుజ్జన్న, రమణయ్య, సుబ్బారావు, అక్బర్ పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని సంతపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బారాజు కోరారు. స్టేషన్ పరిధిలోని గాంధీగిరిజన కాలనీలో బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి శనివారం నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం అక్రమ నిల్వలు, పంపిణీలను గుర్తిస్తే డయల్ 112 లేదా 94407 96385, 94407 00097 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొండాయపాళెంలోని సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాయపాళెం, బ్యాంక్ కాలనీ, షార్ కాలనీ, అనగుంట, ఆర్టీఏ కార్యాలయం, నక్కలగుంట, స్నేహనగర్, ఇందిరానగర్, కావేరినగర్, సంఘమిత్ర స్కూల్, బీవీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఏ ట్రస్ట్ ఫర్ ఆల్ సంస్థ అధ్యక్షుడు అళహరి వెంకటేష్ కోరారు. ఈ మేరకు గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్, రమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

314 మద్యం బాటిళ్ల సీజ్

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల తరుణంలో మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై పోలీస్, ఎస్ఈబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా సైదాపురంలో 20, కృష్ణపట్నంలో తొమ్మిది, కొండాపురంలో 15, సంగంలో 11, దుత్తలూరులో ఏడు, జలదంకిలో 25, చేజర్లలో పదింటిని పోలీసులు.. 217 బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు శుక్ర, శనివారాల్లో సీజ్ చేశారు.

సంక్షేమం అందాలంటే జగనే సీఎం కావాలి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



ప్రచారంలో భాగంగా స్థానికులతో మమేకమైన విజయసాయిరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పేదలకు సంక్షేమ పథకాలు సజావుగా అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి కోరారు. నగరంలోని ఆరో డివిజన్లో గల శెట్టిగుంటరోడ్డులో పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌తో కలిసి శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. ఈ డివిజన్లో వందేళ్లుగా లీజులో ఉన్న భూములకు సంబంధించిన 800కుపైగా కుటుంబాలకు పట్టాలను అందించేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్వచ్ఛ రక్ష ద్వారా కామాటి దళితవాడలో కమ్యూనిటీ మరుగుదొడ్లను నిర్మిస్తామని తెలిపారు. డ్రెయిన్లను రూ.ఐదు కోట్లతో నిర్మించామని వెల్లడించారు. నాడు – నేడు ద్వారా బాజీతోట పాఠశాలను అభివృద్ధి చేసిన అంశాన్ని ప్రస్తావించారు. 615 మందికి పట్టాలను పంపిణీ చేశామన్నారు. 15వ డివిజన్ ప్రజల కోసం అర్బన్ పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు యత్నిస్తామని తెలిపారు. ప్రజల కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్టీల్ ఫ్యాక్టరీ వీధిలో 400 మీటర్ల మేర రోడ్డు నిర్మాణంతో పాటు మినీబైపాస్ నుంచి బాలాజీనగర్‌ను కలిపేలా రహదారుల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుంది..

వలంటీర్ల వ్యవస్థను సమూలంగా తొలగించాలనే ఆలోచన చంద్రబాబుకు వచ్చిందని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ముక్కాల ద్వారకానాథ్, కిన్నెర ప్రసాద్, కార్పొరేటర్లు మద్దినేని మస్తానమ్మ, కామాక్షమ్మ, కిన్నెర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

విజయానికి కృషి చేయండి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రాబోయేదీ తమ ప్రభుత్వమేనని.. ఎంపీగా తనను.. నెల్లూరు సిటీ అభ్యర్థిగా ఖలీల్ అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజయసాయిరెడ్డి కోరారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లతో సమావేశాన్ని రామ్మూర్తినగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో విజయసాయిరెడ్డి నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నగరాధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ రింగ్ రోడ్డును నిర్మిస్తాం



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నగర ప్రజల చిరకాల వాంఛ అయిన ఔటర్ రింగ్ రోడ్డును నిర్మిస్తామని, ఎన్నికల అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనను జరపనున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 26, 27వ డివిజన్లలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. స్వర్ణాల చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. రూరల్ నియోజకవర్గంలో సుపరిపాలనతో పాటు ప్రశాంతతను అందించానని, రానున్న రోజుల్లోనూ ఇలానే ఉండేలా చూస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి.. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. మేయర్ స్రవంతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, 27వ డివిజన్ ఇన్‌చార్జి సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, 26వ డివిజన్ల ఇన్‌చార్జీలు చంద్రమౌళి, ఎస్కే బాబు, రొంపిచెర్ల సుబ్బారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నేతలు మలిరెడ్డి కోటారెడ్డి, మొయిళ్ల గౌరి, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరిక

31వ డివిజన్లోని శ్రీలంక కాలనీకి చెందిన 200 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మినీబైపాస్ రోడ్డులోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, 31వ డివిజన్ నేతలు పీటీ జగన్నాథం, దాసరి రాజేష్, విఠల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. చిన్నబజార్, నవాబుపేట, బాలాజీనగర్, నెల్లూరు రైల్వే పోలీస్‌స్టేషన్లతో పాటు ఆరెస్సార్ స్కూల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గస్తీని ముమ్మరం చేసి నేరాలను కట్టడి చేయాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. రైళ్లల్లో నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, బాబీ, వీరానాయక్, రైల్వే ఎస్సై హరిచందన తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకు గానూ నిర్దేశించిన మోతాదులో ఉన్న ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తులనే వినియోగించాలని, నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంహెచ్‌ఓ వెంకటరమణ పేర్కొన్నారు. వనంతోపు కూడలిలో వాటర్ ప్యాకెట్లను విక్రయిస్తున్న దుకాణంపై దాడులను ఆయన ఆధ్వర్యంలో శానిటేషన్ విభాగ సిబ్బంది శనివారం నిర్వహించారు. సింగిల్ యూజ్డ్ గ్లాసులు, కవర్లు, వాటర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానికి నోటీసును జారీ చేసి భారీగా జరిమానాను విధించారు. ప్రజలు సైతం బాధ్యతగా వస్త్ర సంచులనే వినియోగించాలని కోరారు.

ప్రత్యేక బృందాలతో రోజూ స్పెషల్ డ్రైవ్

నగరంలోని వాణిజ్య ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు నగరపాలక సంస్థ నిర్దేశించిన ప్రమాణాల అమలును పరిశీలించేందుకు గానూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ పేర్కొన్నారు. భగత్‌సింగ్ కాలనీ, అలీనగర్, హరనాథపురం, ట్రంక్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో కాలువల పూడికతీత పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్‌ను ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో రోజూ నిర్వహించనున్నామని వెల్లడించారు. దుకాణాల వద్ద డస్ట్ బిన్లను విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానాలను విధిస్తామని స్పష్టం చేశారు. స్వచ్ఛ నెల్లూరు సాకారానికి సహకరించాలని.. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయొద్దని కోరారు.

‘కిశోర్స్ రత్నం’ విద్యార్థులకు అభినందన



నెల్లూరు(అర్బన్): ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన కిశోర్స్ రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులను ఆర్ఐఓ శ్రీనివాసులు అభినందించారు. బైపీసీలో 436 మార్కులు సాధించిన జాహ్నవి, 433 మార్కులను దక్కించుకున్న శుశ్రుత ఆర్ఐఓను శనివారం కలిశారు. ఈ సందర్భంగా వీరిని ఆయన అభినందించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, అకడమిక్ అడ్వైజర్ నరసయ్యనాయుడు, ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్, అధ్యాపకుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర ప్రచారం..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి.. నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 54వ డివిజన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డికాలనీలో ఇంటింటి ప్రచారాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శనివారం నిర్వహించారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నేతలు జకీర్, ఖయ్యూం, ప్రకాష్, మస్తాన్, జెస్సీ, షరీఫ్, శోభన్, సలామ్, అస్లామ్, షఫీ, జక్కావుల్లా తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాలపై చర్యలకు వినతి



ఆర్ఐఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): నగరంలో ఒక కళాశాలకు అనుమతులు పొంది.. గుర్తింపు లేకుండా అనేక జూనియర్ కళాశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై తగు చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ నేతలు కోరారు. ఈ మేరకు ఆర్ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని స్టోన్‌హౌస్‌పేటలోని ఆయన కార్యాలయంలో శనివారం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు షారూఖ్‌ఖాన్, ఆశిష్, అన్వర్, సాయి, దేవ్‌చందు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తరుణంలో ర్యాలీలు, ప్రచారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు తమ విధులను క్షేత్రస్థాయిలో సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. అభ్యర్థుల నామినేషన్ల సమయాలను తెలుసుకొని.. ర్యాలీలను వీడియో తీసి.. వ్యయాలను వారి ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఎక్సైజ్, జీఎస్టీ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి మద్యం నిల్వలు, నగదు బదిలీలను గుర్తించి సీజ్ చేయాలన్నారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘాను ఏర్పాటు చేసి ఒక మెజిస్ట్రేట్‌ను నియమించాలని తెలిపారు. రవాణా వాహనాలు, కంటైనర్లు, లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి, కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సేవలు మరువలేనివి



పొదలకూరు : విధి నిర్వహణలో అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సమావేశంలో శనివారం సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులు అగ్నిమాపక చట్టాలను తెలుసుకుని నిబంధనల మేరకు వ్యాపారాలు చేయాల్సిందిగా సూచించారు. ఎవరో చేసే తప్పులకు ఇతరులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. అగ్నిప్రమాదాలపై ప్రాథమికంగా కొంత వరకు అవగాహన ఉంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ టి.విజయవరకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో వేడుకగా బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలస్వామి ఆలయంలో..



సీతారామస్వామి మందిరంలో..



ఆంజనేయస్వామి ఆలయంలో..

నెల్లూరు(బృందావనం): చైత్రమాసాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ ప్రధాన ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలను నయనానందకరంగా నిర్వహిస్తున్నారు.

- సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు జింకవాహనంపై దర్శనమిచ్చారు. ఈఓ దర్గయ్య, మహేష్ పాల్గొన్నారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో స్వామివారు సూర్యప్రభ, హంసవాహనాలపై విహరించారు. ఉభయకర్తలుగా పెనుబాక గంగాధర్‌రెడ్డి, శోభారాణి దంపతులు తదితరులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కొలువైన సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి హనుమంతసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా భాస్కర్, అమృతవల్లి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, కోశాధికారి మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.
- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో సూర్యప్రభ, హంసవాహనంపై స్వామివారు విహరించారు. ఉభయకర్తలుగా బాలాజీ రవీంద్రనాథ్‌సింగ్, సత్యవతిబాయి దంపతులు, గండవరపు నిరంజన్‌రెడ్డి వ్యవహరించారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ విరుపావఝుల గిరికృష్ణ పాల్గొన్నారు.
- వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. తిరుమంజనం, అభిషేకం, ఊంజల్‌సేవ, సామూహిక విష్ణు సహస్రనామార్చనను జరిపారు. గరుడవాహనంపై రాత్రి దర్శనమిచ్చారు.
- రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో కోదండరామ, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణను నిర్వహించారు.

చేనేతలకు ఎనలేని లబ్ధి



మగ్గం నేస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: చేనేత కుటుంబాలకు ప్రభుత్వం ఎనలేని లబ్ధి చేకూర్చిందని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. తన తండ్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఒకటో డివిజన్లోని నారాయణరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం ఆమె నిర్వహించారు. చేనేత కుటుంబాలతో ముచ్చటించి.. మగ్గంపై చీరలను నేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో ఆదాల చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. మేయర్ స్రవంతి, కాకుటూరు లక్ష్మీసునంద, పాశం శ్రీనివాస్, కార్పొరేటర్ జానా నాగరాజ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, పార్టీ నేతలు వాల్మేటి లక్ష్మీనారాయణరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఒట్టూరు సుధాకర్‌యాదవ్, నాపా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

• ఆత్మీయ సన్మానం



బాలాజీనగర్‌లోని త్యాగరాజ కల్యాణ మండపంలో బ్రాహ్మణ మహిళలతో ఆత్మీయ సమావేశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి సతీమణి సునందరెడ్డి, కుమార్తె నేహారెడ్డి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిని ఘనంగా సత్కరించారు.

– నెల్లూరు(దర్గామిట్ట)